సెలవుల్లోనూ తరగతులపై చర్యలేవీ ?

- ఈ నెల 3 నుంచి జూనియర్ కాలేజీలకు దసరా సెలవులు ప్రకటించిన బోర్డు
- నిబంధనలు అతిక్రమించి తరగతులు నిర్వహిస్తున్న కార్పొరేట్, ప్రైవేటు యాజమాన్యాలు
- తాజాగా 5 నుంచి సెలవులంటూ మరో ప్రకటన
- గత నెలలో అధిక వర్షాలను సాకుగా చూపుతున్న వైనం



సెలవు రోజులోనూ తరగతికి హాజరై బయటకు వస్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: జిల్లాలోని అన్ని యాజమాన్యాలకు చెందిన జూనియర్ కాలేజీలకు ఈ నెల 3వ తేదీ నుంచి అధికారికంగా దసరా సెలవులను ఇంటర్మీడియెట్ బోర్డు కమిషనర్ కృతికా శుక్లా ప్రకటించారు. సెలవు రోజుల్లో ఎలాంటి తరగతులు నిర్వహించరాదని, నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించినా కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు ఆ నిబంధనలు మాకు వర్తించవు అన్నట్లు వ్యవహరిస్తున్నాయి. రెండు రోజులుగా కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు తరగతులు నిర్వహిస్తున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారు. ఇంటర్మీడియెట్ బోర్డు జారీ చేసిన అకడమిక్ క్యాలెండర్ ప్రకారం అన్ని యాజమాన్యాలు నియమ, నిబంధనలు పాటించాల్సి ఉంది. అయితే ప్రభుత్వ, ఎయిడెడ్, ఏపీ మోడల్, రెసిడెన్షియల్, ట్రైబల్ వెల్ఫేర్, కస్తూర్బాల్లో మినహా కార్పొరేట్, సెమీ కార్పొరేట్ కాలేజీల్లో ఇంటర్మీడియెట్ బోర్డు ఆదేశాలను ఏ మాత్రం ఖాతారు చేయకుండా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇలాంటి వాటిని నియంత్రించాల్సిన ఇంటర్ బోర్డు స్థానిక అధికారులు ఏ మాత్రం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దసరా సెలవులు అన్ని యాజమాన్యాలకు వర్తిస్తాయని కమిషనర్ స్పష్టంగా ప్రకటన జారీ చేశారు. ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి గత నెల 30న జూనియర్ కాలేజీల అన్ని యాజమాన్యాలకు సెలవులు అని ప్రకటన జారీ చేశారు. అయితే శుక్రవారం మరోసారి దసరా సెలవులు ఈ నెల 5వ తేదీ నుంచి అని మరో ప్రకటన జారీ చేయడం గమనార్హం. వాస్తవానికి బోర్డు నుంచి ఎలాంటి అధికారిక ఉత్తర్వులు లేవు.

మౌఖికంగా చెప్పారని సమాధానం

సెలవుల్లో కార్పొరేట్, ప్రైవేటు కాలేజీలు తరగతులు నిర్వహిస్తున్నారని ఆర్ఐఓను ప్రశ్నించగా గత నెలలో కురిసిన అధిక వర్షాల వల్ల సిలబస్ పూర్తి కాకపోవడంతో తగరతులు నిర్వహించుకునేందుకు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ మౌఖికంగా చెప్పారని ఒకసారి, కమిషనర్ వీడియో కాన్ఫరెన్స్ పెట్టి అన్ని యాజమాన్యాలకు వెనుకబడిన సిలబస్‌ను పూర్తి చేసుకునేందుకు తరగతులు నిర్వహించుకోమని చెప్పారని మరోసారి బదులిచ్చారు. వాస్తవానికి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్‌కు సెలవుల ప్రకటనకు ఎలాంటి సబంధం లేదు. కార్పొరేట్ కాలేజీలు ప్రతి రోజు విద్యార్థులను చదువుల పేరిట ఉదయం నుంచి రాత్రి వరకు ఒత్తిడి చేస్తుండడంతో చాలా మంది తట్టుకోలేక కాలేజీల నుంచి పారిపోయిన ఘటనలు అనేకం ఉన్నాయని, సెలవుల్లో తరగతులు నిర్వహిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని పలు విద్యార్థి సంఘాలు సైతం అధికారులకు ఫిర్యా దులు చేస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారు.

నాన్ టీచింగ్ ఉద్యోగుల ఆందోళన

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ ఉద్యోగులు శుక్రవారం వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ చాంబర్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు నాన్ టీచింగ్ ఉద్యోగులు కృష్ణవేణి, కిరణ్మయి, ఎలిశా, రాణి, బాబు మాట్లాడుతూ.. విశ్వవిద్యాలయంలో ఐదేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారందరికీ టైం స్కేల్ వర్తింపజేసి, గత పదేళ్లుగా కాంట్రాక్టు నాన్ టీచింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న తమకు టైం స్కేల్ వర్తింపజేయకుండా వివక్షకు గురిచేస్తున్నారని ఆరోపించారు. మిగతా ఉద్యోగుల మాదిరిగా తమకు జీత భత్యాలు పెంచాలని అధికారులను విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదన్నారు. వీరికి ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, ఎస్ఎఫ్ఐ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు రామకృష్ణ, ఆర్‌పీఎస్ఎఫ్ విశ్వవిద్యాలయ అధ్యక్షుడు నాగరాజు, అంబేడ్కర్ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మధుకృష్ణ, టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్ తదితరులు మద్దతు తెలిపారు.

క్లుప్తంగా

బాల్యంపై కవితల పోటీ

కర్నూలు కల్చరల్: బాల్యం అంశంపై కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు గణేష్ సాహితీ సంస్థ అధినేత కొత్తూరు సత్యనారాయణ గుప్త ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పదవ తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుకున్న వారు ఈ పోటీల్లో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. బాల్యంపై రాసిన కవితలను ఈనెల 10వ తేదీలోగా 94402 28999 ఫోన్ నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలని, 15వ తేదీన విజేతలను ప్రకటించడం జరుగుతుందని వెల్లడించారు.

నేడు పౌరాణిక నాటక ప్రదర్శనలు

కర్నూలు కల్చరల్: కళావాహిని సాంస్కృతిక సాహితీ సంస్థ ఆధ్వర్యంలో ప్రముఖ రంగస్థల కళాకారుడు, కందుకూరి పురస్కార గ్రహీత జి.సి.సుబ్బారావు సంస్మరణ కార్యక్రమం శనివారం సాయంత్రం 6.30 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.మనోహర్‌బాబు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణ పడక సీను, గయోపాఖ్యానం యుద్ధ సీను ఉచిత పౌరాణిక నాటక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు నగరంలో విద్యుత్ కోతలు

కర్నూలు న్యూసిటీ: విద్యుత్ కొత్త లైన్ల నిర్మాణం, మరమ్మతులు, నిర్వహణ నిమిత్తం నగరంలో శనివారం రెండు విడతలుగా విద్యుత్ కోతలు విధించనున్నట్లు ఆపరేషన్స్ కార్యనిర్వహణ ఇంజినీర్ శేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. క్యాంప్స్ సెక్షన్, ఓల్డ్‌టౌన్ సెక్షన్, ఎస్టేట్ సెక్షన్ల పరిధిలోని కాలనీలు, నగరాలలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు తిరిగి మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు కోతలు విధిస్తున్నట్లు వెల్లడించారు. ప్రజలు సహకరించాలని కోరారు.

సచివాలయ ఉద్యోగులకు సన్మానం


ఉద్యోగులను సన్మానిస్తున్న కలెక్టర్ పి.రంజిత్‌బాషా

కర్నూలు(సెంట్రల్): ఆపదలో ఉన్న వారికి, ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి దగ్గరికే వెళ్లి పింఛన్ అందజేయడం గొప్ప విషయమని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో.. సేవా తత్పరత, మానవతా దృక్పథంతో లబ్ధిదారుల ఆస్పత్రుల్లో, ఇతర ప్రాంతాల్లో ఉన్నా వారి వద్దకే వెళ్లి పింఛన్లను అందజేసి ప్రభుత్వ లక్ష్యాన్ని నెరవేర్చిన 15 మంది సచివాలయ ఉద్యోగులను కలెక్టర్ సన్మానించారు. ఇదేస్ఫూర్తితో ఆపదలో ఉన్న వారికి ప్రభుత్వం సాయం సకాలంలో అందించాలన్నారు. డీఆర్‌డీఏ పీడీ సలీంబాషా, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి పాల్గొన్నారు.

ఆటోకు నిప్పు

కర్నూలు(సెంట్రల్): కర్నూలు కార్పొరేషన్ పరిధిలోని 45వ వార్డు అజీముద్దీన్ నగర్‌లో గురువారం రాత్రి అందరూ నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని దుండగులు ఏపీ 39వీ 2022 నంబరు గల ఆటోకు నిప్పు పెట్టారు. కొంత సమయానికి మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఆటో ఎక్కువభాగం కాలిపోయింది. కాలిపోయిన ఆటోను శుక్రవారం సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు పరిశీలించారు. బాధిత ఆటో డ్రైవర్‌ను ఆదుకోవాలని, ఆటోకు నిప్పు పెట్టిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు.

బాధ్యతల స్వీకరణ


డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ వి.హరినాథ్‌బాబు

కర్నూలు సిటీ: ఆంధ్రప్రదేశ్ ప్రజా రవాణా విభాగంలో ఏడాదికిపైగా ఖాళీగా ఉన్న డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్ స్థానం ఎట్టకేలకు భర్తీ అయ్యింది. ఆ స్థానంలో వి.హరినాథ్ బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ డిప్యూటీ చీఫ్ మెకానికల్ ఇంజినీర్‌గా రజియా సుల్తానా పనిచేసి గతేడాది నంద్యాల జిల్లా ప్రజా రవాణా అధికారిగా బదిలీ అయ్యారు. అప్పటి నుంచి ఖాళీగా ఉన్న ఈ పోస్టులో ఇటీవల ప్రజా రవాణా అధికారులు కడప కంట్రోలర్ ఆఫ్ స్టోర్స్‌గా పనిచేస్తున్న వి.హరినాథ్ బాబును నియమించారు. శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన ఆయనకు ఆర్టీసీ అధికారులు, ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

'అమెరికా భారతి'లో కర్నూలు కథ

కర్నూలు కల్చరల్: అమెరికన్ తెలుగు అసోసియేషన్ (ఆటా) వారు నిర్వహించే 'అమెరికా భారతి' తెలుగు పత్రికలో కర్నూలుకు చెందిన కథా రచయిత ఇనాయతుల్లా రచించిన 'అదృశ్యం కాని దృశ్యం' కథ ప్రచురితమైంది. వార్ధక్యంలో ఉన్న తల్లిదండ్రుల పట్ల ప్రస్తుత తరం యువత చూపిస్తున్న నిర్లక్ష్య వైఖరి, పతనమవుతున్న మానవ సంబంధాల గురించిన ఇతివృత్తం కల్గిన ఈ కథ తల్లిదండ్రుల బాధ్యతను గుర్తెరిగేటట్లు చేస్తుంది.

జయహో.. జగన్మాత


భరతమాత ఆలయంలో..


బుధవార పేట కాళికాంబ ఆలయంలో..


బండిమెట్ట అంబాభవాని ఆలయంలో..


బుధవారపేట దుర్గమ్మ ఆలయంలో..


గీతా మందిరంలో..


కాళికాంబ ఆలయంలో గాయత్రీ మాత అలంకరణ

కర్నూలు కల్చరల్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం అమ్మవారి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. నగరంలోని ఆలయాల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొని తరించారు. అభిషేకం, హోమాలు, రథోత్సవం, లలితా సహస్రనామ పారాయణం, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. నగరంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహాలకు పూజలు చేసి, ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నాగలాపురం సుంకులా పరమేశ్వరి ఆలయం, వెంకాయపల్లె ఎల్లమ్మ ఆలయం, కల్లూరు వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయం, సప్తగిరి నగర్‌లోని చౌడేశ్వరి దేవి ఆలయం, బుధవార పేట కాళికాంబ ఆలయం, వన్‌టౌన్ కాళికాంబ ఆలయం, చిత్తారి వీధి నిమిషాంబ దేవి ఆలయంలో గాయత్రీ దేవిగా, చిన్న అమ్మవారి శాలలో ధనలక్ష్మిగా, పెద్ద అమ్మవారిశాలలో అన్నపూర్ణగా, నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో ధనలక్ష్మిగా, వన్‌టౌన్ గీతా మందిరంలో శ్రీ నంది విద్యా నటేశ్వరిగా, బండిమెట్ట అంబా భవాని ఆలయంలో గౌరీ దేవిగా ప్రత్యేకంగా అలంకరించి దర్శనభాగ్యం కల్పించారు.


సప్తగిరి నగర్ చౌడేశ్వరీ ఆలయంలో..


సత్యసాయి మందిరంలో..


జమ్మిచెట్టు వద్ద పల్లకీ సేవలో భక్తులు


లలితా పీఠంలో సామూహిక కుంకుమార్చనలో భక్తులు


నాగలాపురంలో గాయత్రీ దేవిగా..


గోదాగోకులంలో ధాన్యలక్ష్మిగా..


వీఆర్ కాలనీలో ధనలక్ష్మిగా..


లలితా పీఠంలో లలితా సుందర దేవి


నిమిషాంబ దేవి ఆలయంలో..


నన్నూరు సరస్వతీ దేవి ఆలయంలో..


కురువ వీధిలో కొలువుదీరిన దుర్గామాత


సుబేధార్ వీధిలో..


పీఎల్ నగర్‌లో..


ఇందిరా గాంధీ నగర్‌లో..


గణేష్‌నగర్ విజయ గణపతి ఆలయంలో


సప్తగిరి నగర్ చౌడేశ్వరి ఆలయంలో గాయత్రీ దేవిగా..

మహిళలు క్రీడల్లో రాణించాలి


జ్యోతి ప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఆర్‌యూ వీసీ యన్.టీ.కె. నాయక్

కర్నూలు (టౌన్): మహిళలు క్రీడల్లో రాణించాలని, తద్వారా మనోధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ యన్.టీ.కె.నాయక్ అన్నారు. శుక్రవారం రామచంద్రనగర్‌లోని సాయికృష్ణ డిగ్రీ కళాశాలలో ఆర్‌యూ అంతర్ కళాశాలల మహిళా క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీలను వీసీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడారు. ప్రిన్సిపాళ్లు జానీబాషా, సుందర్ రాజు, ఆర్‌యూ అసిస్టెంట్ డైరెక్టర్ శివకిషోర్ పాల్గొన్నారు. పోటీల్లో వివిధ కళాశాలల నుంచి 15 కబడ్డీ, చెస్ జట్లు పాల్గొన్నాయి.

కబడ్డీ పోటీల ఫలితాలు

కర్నూలు శంకరాస్ డిగ్రీ కళాశాల జట్టు నందికొట్కూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించింది. అలాగే కర్నూలు సాయికృష్ణ డిగ్రీ కళాశాల జట్టు నందికొట్కూర్ బసిరెడ్డి డిగ్రీ కళాశాల జట్టుపై, కర్నూలు శ్రీలక్ష్మీ బీపీఈడీ జట్టు నంద్యాలకు చెందిన రామకృష్ణ డిగ్రీ కళాశాల జట్టుపై, సెయింట్ జోసెఫ్ మహిళా డిగ్రీ కళాశాల జట్టు ఎమ్మిగనూరు ఎస్ఎంఎల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జట్టుపై విజయం సాధించాయి.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

కర్నూలు: నగర శివారు కోడుమూరు రోడ్డులోని రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్న సురేష్ అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. సి.బెళగల్ మండలం ఈర్లదిన్నె గ్రామానికి చెందిన ఈయన కర్నూలులో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ రాజీవ్ గృహకల్పలో నివాసముంటున్నాడు. ఇతనికి కోడుమూరు మండలం పులకుర్తి గ్రామానికి చెందిన సుజాతతో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. కుటుంబ ఆర్థిక పరిస్థితులు సరిగా లేక తరచూ భార్యాభర్తలు గొడవ పడుతుండేవారు. ఇటీవల భార్య సురేష్‌తో గొడవపడి పుట్టింటికి వెళ్లింది. గురువారం ఇంటి పక్కనున్న బాబు, అతని కుమారుడు బన్ని తనను కొట్టి గాయపరిచారని కుటుంబసభ్యులకు ఫోన్ చేసి చెప్పి తర్వాత స్విచాఫ్ చేసి గదిలో తాడుతో ఉరి వేసుకున్నాడు. ఘటనపై కోడలు, ఆమె కుటుంబ సభ్యులే తన కుమారుడి మృతికి కారకులని బాధితుడి తల్లి రంగమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

నేడు నామినేషన్లు

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ లిమిటెడ్ డైరెక్టర్ల ఎన్నికలకు సంబంధించి ఈ నెల 5న నామినేషన్లు స్వీకరించనున్నారు. ఈ నెల 22న ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు శనివారం ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. పశుసంవర్ధక శాఖ కర్నూలు డివిజన్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ దుర్గాప్రసన్నబాబు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. కొండారెడ్డిబురుజు సమీపంలోని బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలో నామినేషన్లు స్వీకరిస్తామని ఎన్నికల అధికారి తెలిపారు. మొత్తం 404 మంది ఓటర్లు ఉండగా రహస్య బ్యాలెట్ పద్ధతి ద్వారా 12 మంది డైరెక్టర్లను ఎన్నుకుంటారు. 7న నామినేషన్ల పరిశీలన, 8వ తేదీ ఉపసంహరణ అనంతరం తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు. ఈ నెల 22న బహుళార్థ పశువైద్యశాల ప్రాంగణంలోనే ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, ఆ వెంటనే ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తామని తెలిపారు. అదే రోజున ఆఫీసు బేరర్ల ఎన్నిక జరుగుతుందని వెల్లడించారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం వద్దు


మద్దూరు నగర్‌లో పేరుకుపోయిన మురుగును పరిశీలిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): సమస్యల పరిష్కారంలో సంబంధిత అధికారులు, సిబ్బంది జాప్యం చేయవద్దని నగరపాలక కమిషనర్ ఎస్.రవీంద్రబాబు ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక ఆనంద్ థియేటర్ సమీపంలోని హంద్రీనది వంతెన, మద్దూరు నగర్, గౌసియా కాంప్లెక్స్, లక్ష్మీనగర్, డైమండ్ కాంప్లెక్స్, గ్రీన్ పార్కు రోడ్డు ప్రాంతాల్లో అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. కమిషనర్ మట్లాడుతూ.. హంద్రీ నది పరిసర ప్రాంతాలు శుభ్రం చేయాలన్నారు. మద్దూరునగర్‌లో సమస్యగా మారిన ఆక్రమణలను తొలగించాలని, అధ్వానంగా ఉన్న మురుగు కాల్వలను గుర్తించి పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, ఎంఈ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓను కలిసిన ఏపీఆర్ఎస్ఏ ఉద్యోగులు


ఆర్డీఓకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉద్యోగులు

కర్నూలు రూరల్: కర్నూలు ఆర్డీఓ కిడారి సందీప్‌కుమార్‌ను శుక్రవారం ఏపీఆర్ఎస్ఏ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఏపీఆర్ఎస్ఏ డివిజన్ అధ్యక్షుడు రామాంజనేయలు, కార్యదర్శి వేణుగోపాలరావు, ట్రెజరర్ సహెరాబాను, జాయింట్ సెక్రటరీ జగదీష్, డీ.సీ మెంబర్ సనా ఆఫ్రీన్ ఆర్డీఓను ఆయన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చాలు అందజేశారు. ఆర్డీఓ ఉద్యోగుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

క్షయ, కుష్టు వ్యాధులను నిర్మూలించాలి


మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో క్షయ, కుష్టు వ్యాధులను సమూలంగా నిర్మూలించాలని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్.భాస్కర్ సూచించారు. శుక్రవారం కర్నూలు మెడికల్ కాలేజీలోని పాథాలజీ లెక్చరర్ గ్యాలరీలో వైద్యాధికారులకు క్షయ, కుష్టు వ్యాధుల నిర్మూలనపై ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. జిల్లాలోని సామాజిక, ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న వైద్యాధికారులకు రెండు బ్యాచ్‌లుగా ఈ నెల 4, 5 తేదీల్లో చేపట్టిన శిక్షణ కార్యక్రమంలో జాతీయ క్షయ, కుష్టు ఎలిమినేషన్ కార్యక్రమంలో భాగంగా సంబంధిత యాప్‌లు, పోర్టల్‌లలో పొందుపరచాల్సిన అంశాల గురించి అవగాహన, హ్యాండ్స్ ఆన్ ట్రైనింగ్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ శిక్షణలో పాల్గొన్న వైద్యాధికారులు వారి పరిధిలోని ఆరోగ్య పర్యవేక్షకులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలకు ఇదే అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సత్యవతి, డీఐఓ డాక్టర్ నాగప్రసాద్, డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, టీహెచ్ వార్డు వైద్యాధికారి డాక్టర్ శ్రీదేవి పాల్గొన్నారు.

'తల్లికి వందనం' వెంటనే అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం పథకాన్ని తక్షణమే అమలు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రకాష్‌నగర్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలైనా ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడం లేదని విమర్శించారు. తల్లికి వందనం పథకం కింద ఎంత మంది పిల్లలు బడికి వెళితే అందరికీ ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారని, వెంటనే నిధులు విడుదల చేసి హామీ నిలుపుకోవాలన్నారు. అలాగే డిగ్రీ, ఆపై తరగతులు చదివే విద్యార్థులకు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అయితే ముయమంత్రి చంద్రబాబునాయుడు వాటిపై ఏమీ మాట్లాడకపోవడం అన్యాయమన్నారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు దిగాలని పార్టీ శ్రేణులకు సూచించారు. కార్యక్రమంలో మహేష్, ఖాదర్ బాషా, రమేష్, శాలిమా, ఆశాబీ పాల్గొన్నారు.

అన్నీ తామై.. ఆత్మీయ బంధువులై


బయమ్మ మృతదేహాన్ని స్వస్థలానికి తరలిస్తున్న లైఫ్ రక్త సహాయ బృందం సభ్యులు

కర్నూలు(హాస్పిటల్): అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెకు అండగా నిలిచారు. బాగోగులు చూసుకోవడమే గాక ఆమె మరణించడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేందుకు సహకరించి ఆదర్శంగా నిలిచారు బేతంచర్లకు చెందిన లైఫ్ రక్త సహాయ బృందం సభ్యులు. వివరాలు.. అనంతపురం జిల్లా కదిరికి చెందిన బయమ్మ (75) అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో చేరింది. ఆపరేషన్ అనంతరం అచేతన స్థితిలో ఉన్న ఆ మహిళను చూసుకోవడానికి కుమార్తె ఒక్కరే ఉండటంతో నడిపించేందుకు, డ్రెస్సింగ్ చేసేందుకు ఇబ్బంది పడుతూ లైఫ్ సహాయ బృందానికి ఫోన్ చేసి సాయమడిగారు. వెంటనే వచ్చిన బృందం సభ్యులు పదిరోజుల పాటు ఆమెకు ఆసుపత్రిలో సపర్యలు చేశారు. అయినా ఆమె కోలుకోలేక గురువారం మరణించారు. హాస్పిటల్‌లో అన్ని లాంఛనాలు పూర్తి చేసి వారు ఊరికి వెళ్లేందుకు బేతంచర్ల రోటరీ క్లబ్ అంబులెన్స్ సహకారంతో గమ్యానికి పంపించారు. డోన్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి ఎస్.తంగముని, స్ఫూర్తి మధు, శాంతి మహేశ్వరి, శిరీష, జానకిరాం, కట్టెరపల్లి నరేష్ తదితరులు సాయం అందించినట్లు లైఫ్ రక్త సహాయ బృందం కార్యదర్శి జి.శ్రీనివాసులు తెలిపారు.

దోమలను నివారించాలి


తొట్టిలో నీటిని పరిశీలిస్తున్న డెమో శ్రీనివాసులు

కర్నూలు(హాస్పిటల్): ఇళ్లు, పరిసరాల్లో దోమలు పెరగకుండా ప్రతిఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని డెమో శ్రీనివాసులు సూచించారు. స్థానిక శరీన్‌నగర్‌లోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫ్రైడే - డ్రైడే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వీధుల్లో పర్యటించి ఇళ్లు, పరిసరాలలోని పాత్రల్లో నీటి నిల్వలను పరిశీలించారు. ఇళ్ల వద్ద తొట్టెలలో నిల్వ ఉన్న నీటిలో లార్వా ఉండటాన్ని గమనించి, ఆ నీటిని పారబోయించారు. డ్రమ్ములు, తొట్టెలు, ఇతర పాత్రలలో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచుకోవద్దని సూచించారు. వ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే దోమల నివారణ చర్యలు చేపట్టాలన్నారు. దోమల వల్ల డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికున్‌గున్యా, మెదడువాపు తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వివరించారు. డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణవేణి, ప్రాజెక్టునిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

కర్నూలు ఎంపీడీఓగా రఘునాథ్

కర్నూలు (రూరల్): కర్నూలు మండల ఎంపీడీఓగా జి.రఘునాథ్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా అనంతపురం జిల్లా నుంచి ఈయన కర్నూలు ఎంపీడీఓగా వచ్చారు. గతంలో కర్నూలు మండల ఈఓఆర్డీగా ఈయన ఇక్కడే పనిచేశారు.